# ఫలితాల్లో అమ్మాయిలు.. టాపర్లలో అబ్బాయిలు

- టాప్ -10లో ఒకే ఒక్క అమ్మాయి
- ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నిరుటి కంటే తగ్గిన ఉత్తీర్ణతశాతం
- ఏపీ విద్యార్థులకు ర్యాంకులు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): టీజీ ఎప్‌సెట్-25 ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రెండు విభాగాల్లోనూ అమ్మాయిలే అధికంగా ఉత్తీర్ణులయ్యారు. టాపర్లలో మాత్రం అబ్బాయిల హవా కనిపించింది. ఇంజినీరింగ్‌లో అమ్మాయిలు 73.88%, అబ్బాయిలు 72.79% క్వాలిఫై అయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో అమ్మాయిలు 88.32%, అబ్బాయిలు 86.29% అర్హత సాధించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్-25 ఫలితాలు విడుదలయ్యాయి. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫలితాలు విడుదల చేశారు. ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు ఎప్‌సెట్ పరీక్షలు నిర్వహించారు. ఇంజినీరింగ్‌లో 150కి 150 మార్కులతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థి పల్లా భరత్‌చంద్ర స్టేట్ టాపర్‌గా నిలిచాడు. అగ్రికల్చర్, ఫార్మసీలో మాత్రం 150కి 141 మార్కులతో మేడ్చల్ జిల్లా నిజాంపేటకు చెందిన సాకేత్‌రెడ్డి స్టేట్ టాపర్‌గా నిలిచాడు.

### టాపర్లలో అంతా అబ్బాయిలే..

ఇంజినీరింగ్ విభాగం టాప్ 10 ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. తొలి పదికి పది ర్యాంకులను అబ్బాయిలే సొంతం చేసుకున్నారు. ఒక్కరు కూడా అమ్మాయి లేకపోవడం గమనార్హం. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం టాప్-10 ర్యాంకుల్లో అబ్బాయిలే ప్రతిభ చాటారు. టాప్-10లో 9 ర్యాంకులను అబ్బాయిలే సొంతం చేసుకోగా, ఒకే అమ్మాయి చోటు సాధించింది. బ్రాహ్మణి రేండ్ల టాప్-5 ర్యాంకు సాధించారు. 20 మంది టాపర్లలో 19 మంది అబ్బాయిలే ఉండగా, ఒక్కరే అమ్మాయి కావడం గమనార్హం.



### ఉత్తీర్ణతశాతం ఢమాల్

ఎప్‌సెట్ ఉత్తీర్ణతశాతం కొంత కాలంగా తగ్గుతున్నది. ఇంజినీరింగ్‌లో పాస్ పర్సంటేజీ నాలుగేండ్ల కాలంలో 7% పడిపోయింది. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పాస్ పర్సంటేజీ ఒకశాతం తగ్గింది. 2024లో ఇంజినీరింగ్‌లో 74% క్వాలిఫై అయితే ఈ సారి 73కు పడిపోయింది. అగ్రికల్చర్, ఫార్మసీలో 2024లో 89% విద్యార్థులు క్వాలిఫై కాగా, ఈ సారి 87% విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. అంటే ఉత్తీర్ణత రెండుశాతం తగ్గింది.

### అడ్మిషన్లే లేనప్పుడు.. ఏపీ వాళ్లకు అనుమతెందుకో

ఏపీ విద్యార్థులకు తెలంగాణలో అడ్మిషన్లు ఇవ్వబోమన్నారు. కానీ ప్రవేశ పరీక్ష అయిన ఎప్‌సెట్‌కు మాత్రం అనుమతిస్తున్నారు. అడ్మిషన్లు ఇవ్వనప్పుడు ప్రవేశపరీక్షకు అనుమతి ఎందుకిస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఏడాది ఎప్‌సెట్ ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తాచాటారు. ఇంజినీరింగ్ టాపర్ పల్లా భరత్‌చంద్ర స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా కాగా, రెండో ర్యాంకర్ ఊడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా నుంచి దరఖాస్తు చేసినా, స్వస్థలం నంద్యాల జిల్లా. టాప్-3 ర్యాంకర్ సూర్యకార్తీక్‌ది విజయనగరం. వీరే కాకుండా మరికొందరు కూడా ఏపీ విద్యార్థులున్నట్టు తెలుస్తున్నది. వాస్తవానికి ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో మొత్తం సీట్లు మనోళ్లకే రిజర్వుచేశారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఇవ్వబోమని ప్రకటించారు. అయితే ఎప్‌సెట్ దరఖాస్తుకు మాత్రం అనుమతించారు. దీంతో తెలంగాణేతర విద్యార్థులు 25,431 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్థానికేతరులకు కన్వీనర్ కోటా సీట్లు పొందే అవకాశం లేదు. కానీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు మాత్రం పోటీపడొచ్చు.

**ఫలితాల వివరాలిలా.. ఇంజినీరింగ్‌లో**

| - | అమ్మాయిలు | అబ్బాయిలు | మొత్తం |
|---|---|---|---|
| పరీక్షకు హాజరైన వారు | 88,139 | 1,19,051 | 2,07,190 |
| క్వాలిఫై అయిన వారు | 65,120 | 86,659 | 1,51,779 |
| క్వాలిఫై శాతం | 73.88 | 72.79 | 73.26 |

**అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో**

| - | అమ్మాయిలు | అబ్బాయిలు | మొత్తం |
|---|---|---|---|
| పరీక్షకు హాజరైన వారు | 61,331 | 19,867 | 81,198 |
| క్వాలిఫై అయిన వారు | 54,166 | 17,143 | 71,309 |
| క్వాలిఫై శాతం | 88.32 | 86.29 | 87.82 |

**అగ్రికల్చర్, ఫార్మసీ టాప్ 10 ర్యాంకర్లు**

| ర్యాంకు | పేరు | మార్కులు | స్వస్థలం |
|---|---|---|---|
| 1 | పీ సాకేత్‌రెడ్డి | 141 | నిజాంపేట, మేడ్చల్ |
| 2 | ఎస్ లలిత్ వరేణ్య | 140 | కరీంనగర్ |
| 3 | చాడ అక్షిత్ | 140 | వరంగల్ |
| 4 | పీ రచల సాయినాథ్ | 138 | కొత్తకోట, వనపర్తి |
| 5 | బ్రాహ్మణి రేండ్ల | 138 | మాదాపూర్, హైదరాబాద్ |
| 6 | గుమ్మడిదల తేజస్ | 137 | కూకట్‌పల్లి, హైదరాబాద్ |
| 7 | కొలన్ అభిరానంద్‌రెడ్డి | 137 | నిజాంపేట, మేడ్చల్ |
| 8 | ఎస్ భానుప్రకాశ్‌రెడ్డి | 136 | బైరామల్‌గూడ, రంగారెడ్డి |
| 9 | ఏ శామ్యూల్ సాత్విక్ | 136 | హైదర్‌గూడ, రంగారెడ్డి |
| 10 | ఏ శశికిరణ్‌రెడ్డి | 136 | బాలాపూర్, రంగారెడ్డి |

**ఇంజినీరింగ్ టాప్ 10 ర్యాంకర్లు**

| ర్యాంకు | పేరు | మార్కులు | స్వస్థలం |
|---|---|---|---|
| 1 | పల్లా భరత్‌చంద్ర | 150 | పార్వతీపురం మన్యం (ఏపీ) |
| 2 | యూ రామ్‌చరణ్‌రెడ్డి | 148 | రంగారెడ్డి |
| 3 | పీ సూర్యకార్తీక్ | 147 | విజయనగరం |
| 4 | ఎం లక్ష్మీభార్గవ్ | 146 | నాచారం, హైదరాబాద్ |
| 5 | ఎంవీ గణేశ్ రాయల్ | 144 | మాదాపూర్, హైదరాబాద్ |
| 6 | ఎస్ఎస్ రిశాంత్‌రెడ్డి | 143 | మాదాపూర్, హైదరాబాద్ |
| 7 | రుష్మిత్ బండారి | 142 | మాదాపూర్, హైదరాబాద్ |
| 8 | బనిబ్రత మాజీ | 141 | బడంగ్‌పేట, రంగారెడ్డి |
| 9 | కొత్త ధనుష్‌రెడ్డి | 140 | నార్సింగి, రంగారెడ్డి |
| 10 | కొమ్మ సాయికార్తీక్ | 138 | మేడ్చల్ |

## సీఎం ఇంటి నుంచి పోటీ పరీక్షల ఫలితాలా?

- స్వతంత్ర దేశ చరిత్రలో ఇదే మొదటిసారి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావానికి నిదర్శనం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేయడం.. ఆయన అహంభావానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 77 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. పరిపాలనపై, విద్యార్థులపై ఆయనకున్న చులకనభావాన్ని ఇది తెలియజేస్తుందని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సెక్రటేరియట్ ముఖం చూడకుండా కంట్రోల్ కమాండ్ సెంటర్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి పాలన కొనసాగిస్తున్న సీఎం ఇటు పోలీసులు అటు అధికారులను పనిచేసుకోనివ్వడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన అంటే ఇదేనా? అని నిలదీశారు. ఎప్‌సెట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయ భేరి

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ -25 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా విభాగాల్లో టాప్ ర్యాంకులతో నంబర్ వన్ స్థానంలో నిలిచి రికార్డులు సృష్టించిందని శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో టాప్ 10లోపు 6 ర్యాంకులు, టాప్ 100లోపు 50 ర్యాంకులు, అగ్రికల్చర్/ఫార్మా విభాగంలో టాప్ 10లోపు 7 ర్యాంకులు, టాప్ 20లోపు 17 ర్యాంకులు, టాప్ 100లోపు 70 ర్యాంకులు సాధించి తనకు పోటీ లేదని నిరూపించిందని తెలిపారు.

## గూఢచర్యం ఆరోపణలపై ఇద్దరి అరెస్ట్

### మన సైన్యం కదలికలు పాక్‌కు చేర వేస్తున్నట్టు అనుమానం

చండీగఢ్: ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని ఓ పాక్ అధికారికి భారత సైన్యానికి సంబంధించిన సమాచారం చేర వేస్తూ గూఢచర్యానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఇద్దరు అనుమానితులను అరెస్ట్ చేసినట్టు పంజాబ్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఒక అనుమానితుడు భారత సైన్యం కదలికల సమాచారాన్ని పాక్‌లోని హ్యాండ్లర్‌కు(బాధ్యుడికి) చేర వేస్తున్నట్టు తెలుసుకొని అతడిని అరెస్ట్ చేసినట్టు డీజీపీ తెలిపారు. అతడిని విచారించగా మరొకరిని కూడా కస్టడీలోకి తీసుకుంటున్నట్టు చెప్పారు. నిందితుడు తాను సమాచారం చేర వేసినందుకు ఆన్‌లైన్ ద్వారా డబ్బు చెల్లింపులు పొందాడని డీజీపీ వెల్లడించారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## ఎప్‌సెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

### అభినందించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలో గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. బీసీ గురుకులం నుంచి ఇంజినీరింగ్ విభాగంలో 66మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 35మంది విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. ఎస్సీ గురుకులం నుంచి ఇంజినీరింగ్ విభాగంలో 953మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 857మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయా గురుకుల సొసైటీల కార్యదర్శులు సైదులు, అలుగు వర్షిణి ప్రత్యేకంగా అభినందించారు.



## ఎప్‌సెట్ ఫలితాల్లో చరిత్ర తిరగ రాసిన నారాయణ

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): ఎప్‌సెట్ -25 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు సంచలనాలు ఆవిష్కరించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్/ఫార్మా విభాగాల్లో రెండు ఫస్ట్ ర్యాంకులతో చరిత్ర సృష్టించినట్టు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పీ సింధూర నారాయణ, పీ శరణి నారాయణ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో భరత్ చంద్ర, అగ్రికల్చర్/ఫార్మా విభాగంలో పీ సాకేత్ రెడ్డి స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. రెండు విభాగాల్లో టాప్ 10లోపు 5 ర్యాంకులు, టాప్ 100లోపు 54 ర్యాంకులు, టాప్ 500లోపు 265 ర్యాంకులు, టాప్ 1000లోపు 492 ర్యాంకులు ఒక్క నారాయణకు మాత్రమే సాధ్యమని మరోసారి నిరూపించామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో టాప్ 100లోపు 39 ర్యాంకులు, అగ్రికల్చర్/ఫార్మా విభాగంలో టాప్100లోపు 15 ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. 46 ఏండ్లుగా ఇంజినీరింగ్, మెడికల్‌లో టాప్ ర్యాంకులు సాధించిన ఘనత నారాయణ విద్యా సంస్థలదేనని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్-2025లో 300కి 300 మార్కులను ఓపెన్ క్యాటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన బణి బ్రత మాజీ, నారాయణ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.




## ఎప్‌సెట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 11 : ఎప్‌సెట్-2025 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్టు విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లిలోగల ట్రైనిటాట్స్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. వెయ్యిలోపు 33 మంది, 2000 వరకు 72 మంది, 3000లోపు 105 మంది, 5000లోపు 192 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని చెప్పారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేశాయని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఇటీవల ప్రకటించిన ఐఐటీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి 461 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లోనూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, నీట్ ఫలితాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని విశ్వసిస్తున్నట్టు చెప్పారు.

---

# నో క్రెడిట్ స్కోర్? ప్రాబ్లమ్!

## విద్యా రుణం పొందడానికున్న మార్గాలేంటి?




*ప్రస్తుతం అనేకమంది భారతీయ విద్యార్థులకు విద్యా రుణం పొందడమే వారి విద్యాభ్యాస విజయానికి కీలకంగా మారింది. ఇట్టే విద్యా రుణాలను పొందవచ్చని చెప్తున్నా ఇప్పటికీ సరైన క్రెడిట్ స్కోర్, రుణ చరిత్ర లేకపోతే ఎదురయ్యే సవాళ్లు అన్నీఇన్నీ కావుమరి. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనూ విద్యా రుణాన్ని పొందడానికి కొన్ని దారులున్నాయన్నది మరువద్దు. క్రెడిట్ స్కోర్ లేకున్నా దరఖాస్తుదారులు విద్యా రుణాన్ని పొందడానికున్న ఆ మార్గాలేంటో చూద్దాం.*

దేశంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు సాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నది. నైపుణ్య లేదా సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థుల్లో అర్హత ఉన్నవారందరికీ విద్యా రుణాలపై వడ్డీ రాయితీ, మారటోరియం సౌకర్యాలను సెంట్రల్ సెక్టార్ ఇంట్రెస్ట్ సబ్సిడీ (సీఎస్ఐఎస్) స్కీం కల్పిస్తున్నది. అయితే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.4.5 లక్షలలోపున్న విద్యార్థులకే ఈ స్కీం వర్తిస్తుంది. అలాగే క్రెడిట్ గ్యారంటీ ఫండ్ స్కీం ఫర్ ఎడ్యుకేషన్ లోన్స్ (సీజీఎఫ్ఎస్ఈఎల్) ద్వారా రుణ చరిత్ర లేని విద్యార్థులకు క్రెడిట్ గ్యారంటీలు, తనఖా లేని రుణాలను సులువుగా అందిస్తున్నారు. అయితే మాడల్ ఎడ్యుకేషన్ లోన్ స్కీముల కిందనున్న రుణాలకు మాత్రమే సీజీఎఫ్ఎస్ఈఎల్ వర్తిస్తుంది. చదువుకునేటప్పుడు విద్యార్థులు సంపాదించే వీలుండదు. అందుకే అలాంటి విద్యార్థులనుద్దేశించే ఈ పథకాలకు రూపకల్పన చేశారు. అయితే చదువు ముగిసిన తర్వాత ఇచ్చిన గడువులోగా రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్కీములకు సంబంధించి పూర్తి వివరాల కోసం ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.





### తనఖా-సహ దరఖాస్తుదారులు

సాధారణంగా రుణాలిచ్చే బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలు ఆ రుణాలు తిరిగి సజావుగా వసూలు కావాలనే ఎప్పుడూ కోరుకుంటాయి. అందుకే తనఖాపై లేదా బలమైన రుణ పరపతి కలిగినవారి పూచీకత్తుపై రుణాలిచ్చేందుకే రుణదాతలంతా ప్రాధాన్యతనిస్తారు. తద్వారా తమకు నష్టం రాకుండా జాగ్రత్తపడుతాయి. ఉదాహరణకు ఎస్బీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు సెక్యూరిటీలు, ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటివి తాకట్టు పెట్టుకొని ఆకర్షణీయ వడ్డీరేట్లకు లోన్లను మంజూరు చేస్తున్నాయి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు లేదా వారి సంరక్షకుల రుణ చరిత్ర, క్రెడిట్ స్కోర్‌నుబట్టి కూడా రుణాలను మంజూరు చేస్తున్నాయి.

### అన్వేషిస్తే మెరుగైన ప్రయోజనాలు

విద్యా రుణానికి వెళ్లే ముందు రకరకాల బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదించడం ఉత్తమం. రుణాలపై వడ్డీరేట్లు సంస్థనుబట్టి మారుతుంటాయి మరి. ఉదాహరణకు సెక్యూరిటీ లేకుండా ఎస్బీఐ రూ.7.5 లక్షలదాకా విద్యా రుణాలపై 10.65 శాతం వడ్డీరేటును వసూలు చేస్తున్నది. అదే విద్యా రుణాలకు సెక్యూరిటీపై 9.65 శాతం వడ్డీరేటునే వర్తింపజేస్తున్నది. అయితే విద్యార్థినులకు ఈ వడ్డీరేట్లపై 0.50 శాతం రాయితీని అందిస్తున్నది. అలాగే మరి కొన్ని బ్యాంకుల్లో నిబంధనలకు లోబడి ఇంకా తక్కువ వడ్డీరేట్లకే విద్యా రుణాలను పొందవచ్చు.

### గుర్తుంచుకోండి..



- క్రెడిట్ స్కోర్ బాగా లేకున్నా, రుణ చరిత్ర సరిగా ఉండకున్నా, విద్యా రుణాలపై అధిక వడ్డీరేట్లుంటాయి.
- తనఖా పెట్టకపోతే, కో-అప్లికెంట్ క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నా రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు పెరుగుతుంది.
- విద్యా రుణాలు తీసుకునేటప్పుడు చెల్లింపు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈఎంఐ మిస్సైతే జరిమానాలే.
- ప్రాసెసింగ్ ఫీజు, ఇతర అనవసరపు, రహస్య చార్జీలను గమనించాలి. అధిక భారం ఉండకుండా చూసుకోవాలి.
- తీసుకునే రుణం ఎంత? దానిపై వడ్డీరేటు ఎంత? అన్నది తెలుసుకోవాలి. మొత్తం ఎంత చెల్లిస్తున్నారో కూడా గమనించాలి.
- విద్యా సంస్థలనుబట్టి కూడా వడ్డీరేట్లు తగ్గుతాయి.

# రాబడి

## హెడ్జ్ ఫండ్స్ అంటే?

### మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వ్యత్యాసాలు ఏమిటి

మ్యూచువల్ ఫండ్స్ తరహాలోనే ఈ హెడ్జ్ ఫండ్స్ సైతం మదుపరుల రాబడులకు వనరులు. ఇవి కూడా రకరకాల ఆస్తుల్లో, మార్కెట్లలో పెట్టుబడులు పెడుతాయి. అయినప్పటికీ మ్యూచువల్ ఫండ్స్, హెడ్జ్ ఫండ్స్ మధ్య కొన్ని వ్యత్యాసాలున్నాయి. హెడ్జ్ ఫండ్స్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వద్ద నమోదు కావు. కాబట్టి వీటిపై సెబీకి నియంత్రణేదీ ఉండదు. వీటిని ప్రైవేట్‌గా నిర్వహిస్తారు. అలాగే వీటి ప్రధాన లక్ష్యం.. మార్కెట్లలో ఎటువంటి పరిస్థితులున్నా సంప్రదాయేతర మదుపు వ్యూహాలను అనుసరించి అధిక రాబడులను ఒడిసిపట్టుకోవడమే. కానీ ఇది చాలా రిస్క్‌తో కూడుకున్నది. అయితే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతాయి కాబట్టి మ్యూచువల్ ఫండ్స్ కూడా ఒక రకంగా రిస్కే. అయినా హెడ్జ్ ఫండ్స్‌తో చూస్తే తక్కువే. ఇక మ్యూచువల్ ఫండ్స్‌లో రిటైల్ ఇన్వెస్టర్లుంటే, హెడ్జ్ ఫండ్స్‌లో సంపన్నులు లేదా సంస్థాగత మదుపరులుంటారు. కనుక హెడ్జ్ ఫండ్స్‌లో కనీస పెట్టుబడే చాలా అధికంగా ఉంటుంది. ఈ ఫండ్‌పై, దాని పనితీరుపై ఖర్చు, ఫీజులు ఆధారపడి ఉంటాయి. మ్యూచువల్ ఫండ్స్‌లోనైతే సెబీ, ఏయూఎంపై ఇవి ఆధారపడుతాయి. మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగా హెడ్జ్ ఫండ్స్ పారదర్శకంగా ఉండవు. తమ నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ)ను ప్రకటించవు.




---




## టెన్షన్ వీడే.. ఇక సూచీ పరుగే!

కాల్పుల విరమణతో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గిపోయాయి. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న టెన్షన్ వాతావరణం కూడా ఇప్పటికైతే వీగిపోయినట్టైంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇరు దేశాల మధ్య దాదాపు యుద్ధ మేఘాలు కమ్ముకున్న విషయం తెలిసిందే. అయితే అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేస్తుందన్న అభిప్రాయాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ వారం స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల జోష్‌ను సంతరించుకోవచ్చన్న అంచనాలు ఏర్పడుతున్నాయి. నిజానికి ఈ ఉద్రిక్తతలతో గత వారం చివరి రెండు రోజుల్లోనూ సూచీలు భారీగా నష్టపోయాయి. మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల మేర ఆవిరైపోయింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,047.52 పాయింట్లు లేదా 1.30 శాతం పతనమై 79,454.47 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 338.70 పాయింట్లు లేదా 1.39 శాతం క్షీణించి 24,008 దగ్గర ముగిసింది. కాగా, కాల్పుల విరమణ నేపథ్యంలో భారత్-పాక్ మధ్య జరిగే తదుపరి చర్చలు కూడా మార్కెట్లకు దిశా-నిర్దేశం చేయవచ్చని పలువురు గుర్తుచేస్తున్నారు. మరోవైపు అమెరికా-చైనా మధ్య టారిఫ్ వార్‌కు సంబంధించి జరిగే చర్చలు కూడా కీలకం కానున్నాయి. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.